## పరకాల చైర్మన్‌గా సునీల్ కుమార్

వైస్ చైర్ పర్సన్‌గా ఏకు దివ్య



**ప్రజాపక్షం/పరకాల :** పరకాల మున్సిపాలిటీ కొత్త పాలకవర్గం కొలువు దిరింది. సోమవారం పరకాల మున్సిపాలిటీ కార్యాలయంలో ఇటీవల జరిగిన పరకాల మున్సిపాలిటీ ఎన్నికలలో గెలుపొందిన కౌన్సిలర్లచే ఎన్నికల రిటర్నింగ్ అధికారి పరకాల ఆర్డీఓ కే నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు.కాంగ్రెస్ పార్టీ 13 అత్యధిక స్థానాలను గెలుచుకొని చైర్మన్ వైస్ చైర్ పర్సన్ స్థానాలను సొంతం చేసుకునే విషయం తెలిసింది. సోమవారం జరిగిన చైర్మన్ వైస్ చైర్ పర్సన్ల ఎన్నికల సంబంధించి సమావేశం జరగా చైర్మన్గా పావుశెట్టి సునీల్ కుమార్ వైస్ చైర్పర్సన్‌గా నాలుగో వార్డ్ అభ్యర్థి ఏక దివ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన 13 మంది కౌన్సిలర్లు , టిఆర్ఎస్ పార్టీ నుండి గెలుపొందిన ఆరుగురు కౌన్సిలర్లను , బిజెపి నుండి గెలుపొందిన ముగ్గురు కౌన్సిలర్లను ఆయన ప్రమాణం చేయించారు. అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ ల ఎన్నికలకు సంబంధించి పోటీ నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ నుండి ఏడవ వాడు అభ్యర్థి పావిశెట్టి సునీల్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, పరకాల మున్సిపాలిటీ కమిషనర్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్‌గా పాలకుర్తి సారంగపాణి

వైస్ చైర్‌పర్సన్‌గా నేతవత్ శోభారాణి ఎన్నిక



**వర్ధన్నపేట/ప్రజాపక్షం:** వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పీఠాన్ని పాలకుర్తి సారంగపాణి కైవసం చేసుకున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో అత్యధిక మెజారిటీతో ఆయన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్‌గా నేతవత్ శోభారాణి బాధ్యతలు చేపట్టనున్నారు.చేతులెత్తి మద్దతు తెలిపిన కౌన్సిలర్లు చైర్మన్ పదవికి పాలకుర్తి సారంగపాణి పేరును 6వ వార్డు కౌన్సిలర్ మాలోతు దేవేందర్ ప్రతిపాదించగా, ఒకటో వార్డు కౌన్సిలర్ బెజ్జం పాపారావు బలపరిచారు. ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు చేతులెత్తి తమ మద్దతును తెలియజేశారు. సారంగపాణికి అనుకూలంగా మొత్తం 7 ఓట్లు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే నాగరాజు ఓటింగ్ ప్రక్రియలో పాల్గొని సారంగపాణికి తన మద్దతు ప్రకటించారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్‌గా నేతవత్ శిభారాణి ఎన్నికయ్యారు. ఆమె పేరును నునావత్ కమలి ప్రతిపాదించగా, కౌన్సిలర్ వాణి బలపరిచారు. మెజారిటీ సభ్యులు ఆమె వైపు మొగ్గు చూపారు.కొత్తగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎమ్మెల్యే నాగరాజు, ఇతర నేతలు ఘనంగా సత్కరించారు. పట్టణాభివృద్ధే లక్ష్యంగా అందరినీ కలుపుకుని పనిచేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం వెలుపల అభిమానులు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి వర్ధన్నపేట బస్టాండ్ అంబేద్కర్ బొమ్మ వరకు భారీగా ర్యాలీ తో డీజే మోతలతో కాంగ్రెస్ జిందాబాద్ అనే నినాదంతో హోరెత్తించారు.కార్యకర్తలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

## డబల్ బెడ్రూమ్ ఇండ్లపై మాట తప్పిన అధికారులు

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్




**ప్రజాపక్షం, కమలాపూర్:** గత ఆరు నెలల క్రితం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు అందించాలని సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన కార్యక్రమంలో కమలాపూర్ తహశీల్ధార్ ఉన్నతాధికారులు స్వల్ప మరమత్తు పనులు ఉన్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికి కొద్ది రోజుల్లోనే ఇండ్లను అందజేస్తామని హామీ ఇచ్చి విస్మరించారని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్ ఆరోపించారు. కమలాపూర్ మండల కేంద్రంలో సిపిఐ కార్యవర్గ సమావేశం మండల కార్యదర్శి నకీర్త ఓదెలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అధితులుగా హాజరై ఆదరీ శ్రీనివాస్ మాట్లాడుతూ... అర్హులైన ప్రజలకు డబుల్ బెడ్ రూమ్ పంచాలని ఆక్రమించే కార్యక్రమం చేస్తే దానికి తహశీల్ధార్, సిఐ, ఉన్నతాధికారులు వచ్చి మూడు నెలలో పూర్తి చేసి అందిస్తామన్నారు. కానీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇండ్ల తాళాలు పగలగొట్టుకోని, డబుల్ బెడ్ రూములు ఇల్లు లేని పే దలకు నివాసం ఏర్పరచుకుంటామని అన్నారు. పది రోజుల్లో అర్హులకు అందించాలని అధికారులకు,ప్రజాప్రతినిధులను కోరారు. అదే విధంగా రాబోయే స్థానిక ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికల్లో అన్ని స్థానాల్లో సిపిఐ పార్టీ నాయకులు పోటీ చేయబోతున్నారని తెలిపారు. కార్మికుల పట్ల మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే వెనక్కి తీసుకోవాలని అన్నారు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ దర్మల రామ్మూర్తి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి గోలి మహేందర్, కిన్నెర సంతోష్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విద్యార్థులు క్రీడల్లో తమ ప్రతిభను చాటు కుని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకాంక్షించారు. ఈ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు జిల్లా విద్యాశాఖ తరఫున బయలుదేరిన విద్యార్థుల బస్సును సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందన్నారు.రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో పాల్గొనుటకు వివిధ మండలాల నుండి మొత్తం 26 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, 7 మంది తల్లిదండ్రులు బయలుదేరారు. జిల్లా తరఫున పాల్గొంటున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లా గౌరవాన్ని నిలబెట్టాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ముద్దమల్ల రాజేందర్, జిల్లా సమీకృత విద్య కోఆర్డినేటర్, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ శ్యామల రమేష్, జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది, ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్లుదితరులు పాల్గొన్నారు.

# పార్టీ ప్రయోజనాలే ప్రాధాన్యం

వెన్నుపోటు రాజకీయాలు సహించం: మంత్రి సీతక్క

పురపాలక చైర్‌పర్సన్‌గా చింతనిప్పుల చంద్రకళ భిక్షపతి


వైస్ చైర్‌పర్సన్‌గా ఆసియా షాహనా



**ప్రజాపక్షం/ములుగు:** పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యం కల్పిస్తామని, వెన్నుపోటు రాజకీయాలు సహించబోమని మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ములుగు మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా ఎన్నికైన చింతనిప్పుల చంద్రకళ, వైస్ చైర్మన్‌గా ఆసియా షాహనాలు భిక్షపతి సన్మాన కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. కాంగ్రెస్ తరుపున గెలిచిన కౌన్సిలర్లందరిని శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన ప్రతి కార్యకర్తకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా చింతనిప్పుల చంద్రకళ భిక్షపతిని ఎన్నుకున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరికి చైర్‌పర్సన్ కావాలనే ఆశ ఉంటుంది కానీ అవకాశం ఒక్కరికీ మాత్రమే దక్కుతుందని స్పష్టం చేశారు. సీనియర్ అనుభవం కలిగిన నాయకుడిగా, ములుగు టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న చింతనిప్పుల భిక్షపతికి ఈ అవకాశం కల్పించామని తెలిపారు. ఆయనలో చిత్తశుద్ధి, కమిట్‌మెంట్ ఉన్నాయని, పార్టీ కార్యకర్తల అభిష్టం మేరకే ఈ నిర్ణయం తీసుకున్నామని పూర్తి అవగాహన ఉన్న నాయకుడు భిక్షపతి అన్నారు. అవకాశం రానివారు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని, భవిష్యత్తులో మంచి అవకాశాలు అందరికీ వస్తాయని భరోసా ఇచ్చారు. ములుగు మున్సిపాలిటీలో నాలుగు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోవడానికి వెన్నుపోటు రాజకీయాలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీలో ఉండి మోసం చేయడం క్షమించరాని నేరమని, అలాంటి చర్యలను సహించబోమని హెచ్చరించారు. ఎవరు వెన్నుపోటు రాజకీయాలు చేశారో తమకు తెలుసునని, పద్ధతి మార్చుకోవాలని ఇది చివరి హెచ్చరిక అని అన్నారు. అన్ని ఎన్నికలలో కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే విజయం ఖాయమని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

## మరిపెడ మునిసిపాలిటీపై కాంగ్రెస్ జెండా

చైర్ పర్సన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మరిపెడ:** మరిపెడ మున్సిపాలిటీ చైర్ పర్సన్ పీఠం ఎవరికి దక్కుతుంది అనే ఉత్కంఠ కు సోమవారం తెరపడింది. చైర్మన్ పదవి కాంగ్రెస్‌కు దక్కడంతో మున్సిపాలిటీపై కాంగ్రెస్ జండా ఎగిరింది. మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని ఎనిమిదవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డిని చైర్ పర్సన్‌గా, ఆరవ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందిన కాలం సునీత రవీందర్ రెడ్డిని వైస్ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధీకృత అధికారి పురుషోత్తం ప్రకటించారు. గెలుపొందిన చైర్మన్, వైస్ చైర్మన్‌లను ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్ నూతనంగా ఎన్నికైన చైర్పర్సన్,వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలుపగా,చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

## కేసముద్రం మున్సిపాలిటీ కాంగ్రెస్ కైవసం



**ప్రజాపక్షం/కేసముద్రం:** నూతనంగా ఏర్పడిన కేసముద్రం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది ఉత్కంఠ భరితంగా జరిగిన పోరులో టిఆర్ఎస్ ఎనిమిది కౌన్సిలర్లు కాంగ్రెస్ ఎనిమిది కౌన్సిలర్ విజయం సాధించారు ఇరు పార్టీలలో సమానం రావడంతో ఉత్కంఠ నెలకొంది. ఇందులో ఎక్స్ ఆఫిషియన్సీ ఉండడంతో బలరాం నాయక్ ఎంపీ శనివారం నాడు దాఖలు చేసుకోగా ఈరోజు కాంగ్రెస్ వైపు మెజార్టీ ఎక్కువ ఉండడం వలన చైర్ పర్సన్ గా బానోత్ సునీత వెంకన్న ఎన్నుకోవడం జరిగింది. అలాగే వైస్ చైర్ పర్సన్ గా అల్లం రమ నాగేశ్వరరావు గారిని ఓటింగ్ మెజార్టీతో ఎన్నుకోవడం జరిగింది దీనిని మున్సిపల్ కమిషనర్ అధికారికంగా ప్రకటించారు కాంగ్రెస్ నేతల్లో కార్యకర్తల్లో ఉత్సాహం ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుందని ఆనందం వ్యక్తం చేశారు.


## మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా గుగులోత్ జ్యోతి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ అభ్యర్థి గుగులోత్ జ్యోతి రమేస్ ఎన్నికయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలో మెజారిటీ కాంగ్రెస్ సభ్యులు చేతులు లేపడంతో జ్యోతి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. అలాగే వైస్‌చైర్మన్‌గా సిపిఎం అభ్యర్థి సూర్నపు సోమయ్య ఎన్నికయ్యారు. మహబూబాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జండా ఎగిరింది. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీందర్‌రావు పాల్గొన్నారు. అనంతంర కాంగ్రెస్ నాయకులు డిసిసి అధ్యక్షురాలు ఉమామురళీనాయక్, డిసిసి మాజీ అధ్యక్షులు జెన్నరెడ్డి భరత్‌చందర్‌రెడ్డి చైర్మన్ జ్యోతిని అభినందించారు.

## భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్‌గా బుర్ర కొమురయ్య

వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ ఎన్నిక





**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీకి ఈనెల 11న 30 వార్డులకు గాను రెండవ సాధారణ ఎన్నికలు నిర్వహించారు. 13 న ఎన్నికల కౌంటింగ్ నిర్వహించగా కాంగ్రెస్ పార్టీ 16 బిఆర్ఎస్ 10, బీజేపీ2, సిపిఐ1, ఇండిపెండెంట్ 1 లు గెలుపొందారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్ లకు ఎన్నికలు నిర్వహించారు. భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్‌గా బుర్ర కొమురయ్య ఎన్నిక కాగా వైస్ చైర్మన్‌గా అంబాల శ్రీనివాస్ ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందు గా 9 వార్డు కౌన్సిలర్ అప్పం కిషన్ బుర్ర కొమురయ్య పేరును ప్రతిపాదించగా కురిమిళ్ల శ్రీనివాస్ బలపరిచాడు. వైస్ చైర్మన్ గా అంబాల శ్రీనివాస్ పేరును బొద్దు అశోక్ ప్రతిపాదించగా రాజునాయక్ బలపరచడంతో వైస్ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నిక కంటే ముందుగా భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో గెలిచిన 30 వార్డుల కౌన్సిలర్లను ఎన్నికల పరిశీలకులుగా ఆర్డీవో హరికృష్ణ కౌన్సిలర్లను ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎక్స్ అఫీషియో మెంబర్ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచిన 17 మంది సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను 17 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. **కౌన్సిలర్లుగా ప్రమాణం చేసిన 30 వార్డుల సభ్యులు :** 1వ వార్డు కౌన్సిలర్ బౌత్ శోభ ,2 వార్డు బుర్రకొమురయ్య,3ఎర్ర బెల్లి అరుణ్ రావు,4 కన్నం యోగదీశ్వర్, 5 కట్ల పూర్ణ చెందర్, 6 ఎరుకల రేణుక, 7 రత్నం సుమంజలి, 8 బెజ్జల శ్యామల, 9అప్పం కిషన్, 10 పుల్లూరి మంజుల, 11 మోతె రాజు, 12 సతీష్ బొంతల, 13 బడితల వెంకటస్వామి, 14 మాకోటి శ్వేతా, 15 అంబాల శ్రీనివాస్, 16 జ్యోతుల మంజుల, 17 బీర్తీ కమల, 18 మూత సహదేవ్, 19 కురిమిళ్ల శ్రీనివాస్, 20 ఇస్లావత్ రాజునాయక్, 21 ధారవత్ శారద, 22 బుర్ర రమాదేవి, 23 బండం రాజేశ్వరి, 24 వేముల జ్యోతి, 25 పోనగంటి మేఘన, 26 ఒరుగంటి రాధ, 27 వాసల ఈశ్వరమ్మ, 28 భోగం నరేందర్, 29 గండ్ర హరీష్ రెడ్డి,30 బొద్దు అశోక్ నూతనంగా ఎన్నికైన వార్డ్ కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేశారు.

## స్టేషన్‌ఘనపూర్ మున్సిపల్ పీఠంపై కాంగ్రెస్ జెండా

ఛైర్మన్‌గా విజయ్‌కుమార్,

వైస్ చైర్‌పర్సన్‌గా నీల రాజమ్మ

భారీ విజయోత్సవ ర్యాలీ



**ప్రజాపక్షం/జనగామ/స్టేషన్‌ఘనపూర్:** జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీ పీఠంపై కాంగ్రెస్ జెండా ఎగిరింది. సోమవారం జరిగిన ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల్లో రెండింటిని కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్‌గా తాటికొండ విజయ్ కుమార్, వైస్ ఛైర్మన్‌గా నీల రాజమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కొత్తగా ఏర్పడిన మున్సిపాల్టీలో కాంగ్రెస్ జెండా ఎగరి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు దక్కించుకోవడంతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలో సంబురాలు జరుపుకున్నారు. క్యాంప్ కార్యాలయంలో స్వీట్లు పంచుకోవడంతో పాటు భారీగా విజయోత్సవ ర్యాలీ నిర్వయించారు. స్టేషన్‌ఘనపూర్ మున్సిపాల్టీలో 18 వార్డులు ఉండగా ఈ నెల 11 పోలింగ్, 13న కౌంటింగ్ జరగడంతో 13 వార్డుల్లో కాంగ్రెస్, 05 వార్డుల్లో బిఆర్ఎస్ గెలుపొందింది. 13 వార్డులు కాంగ్రెస్ ఖాతాలో చేరడంతో ఛైర్మన్ ఎన్నిక సులభమైంది. సోమవారం ఛైర్మన్ ఎన్నికల నిర్వయించగా ప్రిసైడింగ్ అధికారి ఆర్‌డిఓ వెంకన్న కౌన్సిలర్ల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వయించగా 13వ వార్డు కౌన్సిలర్ తాటికొండ వినయ్‌కుమార్ ఛైర్మన్‌గా, నీల రాజమ్మ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. వీరికి ప్రిసైడింగ్ అధికారి ఆర్‌డిఓ వెంకన్న నియామక పత్రాన్ని అందజేశారు. రెండు పదవులు కాంగ్రెస్‌కు దక్కడంతో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం నెలకొంది.

**కాంగ్రెస్ సంబురాలు:** ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక అనంతరం కాంగ్రెస్ సంబురాలు జరుపుకుంది. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలో స్వీట్లు పంచారు.

## తొర్రూరు మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం తీవ్ర ఉత్కంఠ



**ప్రజాపక్షం/తొర్రూరు :** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపాలిటీలో చైర్మన్ ఎన్నిక ప్రక్రియ కోసం తీవ్ర ఉత్కంఠకు, హైడ్రామాకు దారితీసింది. సోమవారం ఉదయం నుండే స్థానిక రాజకీయ సమీకరణలు వేగంగా మారుతూ వచ్చాయి. మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాల మధ్య నెలకొన్న వాగ్వాదంతో ఒక్కసారిగా హైటెన్షన్ నెలకొంది. తొర్రూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తొమ్మిది వార్డులు గెలుచుకోగా కాంగ్రెస్ పార్టీ ఏడు వార్డులను గెలుచుకుంది. ఇక్కడ బీఆర్ఎస్‌కు మెజారిటీ వచ్చినా ఎక్స్ అఫిషియో మెంబర్ల ఓట్లతో సమానమయ్యాయి. కాగా డ్రా తీసి చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మున్సిపాల్ కార్యాలయానికి రావడంతో పోటాపోటీగా ఇరు వర్గాలు నినాదాలు చేశారు. మున్సిపాలిటీ కార్యాలయానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేరుకోగా ఇదే సమయంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మున్సిపాలిటీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ సమయంలోనే టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి రావడంతో ఝాన్సీరెడ్డి గో బ్యాక్ అంటూ బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గో బ్యాక్ అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నినాదాలు చేయడంతో ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తంగా మారి రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. ఇరు పార్టీల నాయకులను అదుపులోకి తీసుకువచ్చేందుకు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ రంగంలోకి దిగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులను సముదాయించి ఎలాంటి గొడవలు జరగకుండా డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను, సిబ్బందితో భద్రతను కట్టుదిట్టం చేయించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక ప్రారంభం కావాల్సిన సమయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి రంగంలోకి దిగి ఎన్నికను వాయిదా వేయాలన్నారు. ప్రస్తుత పరిస్థితులు అనుకూలంగా లేవని ఉద్రిక్తలు పెరిగే అవకాశం ఉందని ఎమ్మెల్యే రిటర్నింగ్ అధికారికి చెప్పారు. మరోవైపు తమకు స్పష్టమైన బలం ఉందని వెంటనే ఎన్నిక నిర్వహించాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు పట్టుబట్టారు. సరైన సాంకేతిక కారణం లేకుండా ఎన్నిక వాయిదా వేయలేమని రిటర్నింగ్ అధికారి తొలుత స్పష్టం చేసినప్పటికీ ఎమ్మెల్యే ఒత్తిడి, ఉద్రిక్తల నేపథ్యంలో మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికను మంగళవారంకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాల అనంతరం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తమ మద్దతుదారులైన కాంగ్రెస్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపాలిటీ నుండి వెనుదిరిగారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక జరిగే అవకాశం ఉండటంతో తమ కౌన్సిలర్లను మళ్లీ సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యవేక్షణలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రత్యేక బస్సులో సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లారు.

## జనగామ చేజిక్కేనా..!

ఉత్కంఠంగా మారిన మున్సిపల్ ఎన్నిక

ఇరు పక్షాల్లో ఒక్క ఓటే కీలకం

బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి మార్పుతో లుకలుకలు

**ప్రజాపక్షం/జనగామ:** జనగామ మున్సిపల్ ఛైర్మన్ పదవి చివరకు ఎవరికి దక్కుతుందన్నది అస్పష్టంగా ఉంది. చేజిక్కుతుందా..జారీ పోతుందా అన్నది అనుమానమే. కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా వాయిదా వాయిదా పడినా రెండో రోజైన మంగళవారం ఏం జరుగుతుందన్నది ఉత్కంఠంగా ఉంది. ఇరు పక్షాల్లో ఒక్క ఓటే కీలకం కావడం ఇంతటి పరిస్థితికి కారణం. ఇక బిఆర్ఎస్ ఛైర్మన్ అభ్యర్థి పేరు మార్చడంతో లుకలుకలు మొదలు కాగా ఇందులో నుండి ఎవరైనా జారీపోతారా అన్నది కూడా అనుమానంగా ఉంది. జనగామ మున్సిపల్‌లో 30 వార్డులు ఉండగా కాంగ్రెస్ పక్షానికి 16, బిఆర్ఎస్ పక్షానికి 16 సీట్లు ఉన్న విషయం తెలిసిందే. ఏలాంటి అభ్యంతరాలు లేకుంటే చిట్టీలు, టాస్ ద్వారా ఛైర్మన్, వైస్ ఛైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశాలు ఉంటాయి. కానీ వాయిదా వేశారు. రెండో రోజు సైతం ఇదే కొనసాగుతుందా..లేకా కాంగ్రెస్‌కైనా..బిఆర్ఎస్‌కైనా కలిసొచ్చే అవకాశాలు ఏమైనా ఉంటాయా అన్నది తెలియడం లేదు. వాయిదా పడడంతో పరిస్థితి కాంగ్రెస్ చేతుల్లోకి వెళ్లిందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయం అయినా ..ఇది నిజమవుతుందా అన్న అనుమానాలు వ్యక్తం అవుతన్నాయి. **ఒక్క ఓటు...కోట్ల రూపాయలు:** ఇరు పక్షాల్లో ఒక్క ఓటే కీలకంగా మారింది. కాంగ్రెస్‌కు 16 ఓట్లు ఉండగా బిఆర్ఎస్‌కు 16 ఓట్లు ఉన్నాయి. ఒక్క ఓటు కీలకమైంది. కాంగ్రెస్ ఆ ఒక్కరిని ఎలాగైనా సంపాదించాలని చూస్తుంది. బిఆర్ఎస్ చేయాల్సిన ప్రయత్నాలు అన్ని చేసి దేవుడి మీద భారం వేసింది. టాస్ ద్వారా వస్తే వచ్చింది లేకుంటే లేదని భావిస్తుంది. ప్రస్తుతం బిఆర్ఎస్ గూటికి చేరిన ఇద్దరు స్వతంత్రుల కోసమే భారీగా ఖర్చు చేసింది. ఒక కౌన్సిలర్‌కు రెండు కోట్లు కార్ గిఫ్ట్‌గా ఇస్తున్నట్లు, మరో మహిళా కౌన్సిలర్‌కు కోటి రూపాయలతో పాటు ఒక ఇల్లు గిఫ్ట్‌గా ఆఫర్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. మరొకరిని చేరదీసి మరో కోటి, రెండు కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ఆ పార్టీ లేదు. కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చిన ఇద్దరిలో ఒకరికి కాంగ్రెస్ రేబల్ కాగా మరొకరు కాంగ్రెస్ టిక్కెట్టు కోరిన వ్యక్తియే వీరిద్దరికి కొద్దిమొత్తంలో మాత్రమే ముట్టజెప్పడానికి సిద్ధమైనట్లు ప్రచారం.

**బిఆర్ఎస్ చైర్మన్ అభ్యర్థి మార్పుతో లుకలుకలు :** మున్సిపల్ ఎన్నికల ప్రచారం మొదలైనప్పటి నుండి ఛైర్మన్ అభ్యర్థిగా ముస్త్యాల దయాకర్ భార్య ముస్త్యాల మౌనిక పేరును తెరమీదకు తెచ్చారు. ఎన్నికలు పూర్తి అయ్యి క్యాంప్‌కు వెళ్లి తీరా ఛైర్మన్ ఎన్నిక కోసం మున్సిపల్‌కు వచ్చిన రోజు మాత్రం గోపగాని సుగుణాకర్ పేరు ప్రతిపాధించి బలపర్చారు. దీనితో ముస్త్యాల మౌనిక అవాక్కు కావడంతో పాటు అసహనానికి గురైనట్లు కనిపించింది. ఎన్నిక వాయిదా పడి మళ్లీ క్యాంప్‌కు వెళ్తున్న సందర్భంగా మౌనిక ఇంటికి వెళ్లడానికి ప్రత్నించిన నేపథ్యంలో బిఆర్ఎస్ నాయకులు బ్రతిమిలాడి బస్సు ఎక్కించారు. దీనితో పాటు గోపగాని సుగుణాకర్ జనగామలో మద్యం వ్యాపారి. కొత్తగా పార్టీలోకి వచ్చారు. క్యాంప్‌లో ఏం జరుగుతుంది..మంగళవారం ఏం జరగబోతుందన్నది ఉత్కంఠంగా ఉంది.

## జనగామలో ఉద్రిక్తం చైర్మన్ ఎన్నికల వాయిదా!



**ప్రజాపక్షం/జనగామ:** మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక జనగామలో ఉద్రిక్తగా మారింది. నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడగా పోలీస్‌లు ఒక దశలో మున్సిపల్ కార్యాలయం వైపు దూసుకొచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలపై లాఠీచార్జీ చేశారు. మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల కోసం భువనగిరి ఎంపి చామల కిరన్‌కుమార్‌రెడ్డితో పాటు కాంగ్రెస్, స్వతంత్ర, సిపిఎం కౌన్సిలర్లు పోడియం ముందు బైఠాయించి నిరసన తెలపడం కొసమెరుపు. ఇక బిఆర్ఎస్ నుండి ఛైర్మన్ అభ్యర్థిగా కోడై కూసిన ముస్త్యాల మౌనిక పేరును కాదని గోపగాని సుగుణాకర్ పేరు ప్రతిపాధించడం ఆ పార్టీలో చిచ్చు రేపిన పరిస్థితి. జనగామ జిల్లాలో మరో మున్సిపాల్టీ అయినా స్టేషన్‌ఘనపూర్‌ను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. ఛైర్మన్ అభ్యర్థిగా తాటికొండ వినయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**అడ్డగింతలు ఆందోళనలు**

మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సందర్భంగా ఎవరికి వారుగా క్యాంప్‌లకు వెళ్లారు. సోమవారం ఉదయం బిఆర్ఎస్ క్యాంప్ బస్సును కాంగ్రెస్ నాయకులు చామల కిరన్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జనగామలోని పెంబర్తి వద్ద అడ్డుకున్నారు. అయితే అందులో తొర్రూర్‌కు సంబందించిన క్యాంప్ కౌన్సిలర్లు ఉండడంతో వెనుదిరిగారు. ఈ సందర్భంగా స్వల్ప ఘర్షణ జరిగింది. తరువాత బిఆర్ఎస్ కౌన్సిలర్ల బస్సు కార్యకర్తలతో ర్యాలీగా వస్తున్న సందర్భంగా పోలీసులు జనగామలో బ్రిడ్జి వద్ద అడ్డుకున్నారు. హఫీజ్ ఫాతిమాపై ఫిర్యాదు వచ్చినందున బస్సులో ఉంటే విచారణకు రావాలని కోరారు. అక్కడ ఎమ్మెల్యే పోలీసులను అడ్డుకున్నారు. ఆ తరువాత మున్సిపల్‌కు బస్సు చేరుకున్న సమయంలో డిసిపి రాజమహేంద్రనాయక్ అడ్డుకొని కిడ్నాప్‌కు గురైన వ్యక్తి ఉంటే దింపాలని ఆదేశించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే, డిసిపి మధ్య గొడవ జరిగింది. ఎమ్మెల్యే పోలీస్ కమీషనర్, డిజిపితో ఫోన్‌లో మాట్లాడి డిసిపితో మాట్లాడించారు. ఆ తరువాత తనను ఎవరు కిడ్నాఫ్ చేయలేదంటు హఫీజ్ ఫాతిమా గేటు తోచుకొని బిఆర్ఎస్ కౌన్సిలర్లతో కలిసి మున్సిపాల్టీలోకి పరుగెత్తుకుంటు వచ్చారు. ఈ క్రమంలో బస్సు వెంట పరుగులు తీసుకుంటు వచ్చిన బిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు.

